క్లుప్తంగా

ఘనంగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



పెనమలూరు: పోరంకిలో వేంచేసి ఉన్న పద్మావతి గోదాదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి ఆలయం తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయంలో బుధవారం ఉదయం సుప్రభాత సేవ చేసిన అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పరమహంస పరివ్రాజకులు త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీవారికి పంచామృత స్నపన 108 వెండి కలశాలతో అభిషేకం చేశారు. స్వామివారిని తిరువీధుల్లో ఉత్సవం నిర్వహించి అనంతరం సుదర్శనయాగం చేశారు. ఆలయంలో గురువారం ఉదయం తిరుప్పాడసేవ, సామూహిక విష్ణు సహస్రనామపారాయణ, రాత్రి 7 గంటలకు పరమహంస త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీవారి తిరుక్కల్యాణ మహోత్సవం కనులపండువగా చేస్తారు.

పంచాయతీరాజ్ కమిషనర్ ప్రత్యేక పూజలు




పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవస్థానాన్ని ఏపీ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎ.సూర్యకుమారి బుధవారం సందర్శించారు. కమిషనర్ సూర్యకుమారి ఆలయంలో శ్రీస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సాగర్ పూజలు చేశారు. పూజల అనంతరం కమిషనర్ సూర్యకుమారికి ఏపీ ధార్మికపరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆలయ చిత్రపటాన్ని అందచేశారు. ఈవో గంగాధరరావు, అర్చకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవం



గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. పొగాకు వ్యతిరేక పోస్టర్‌ను డిపో మేనేజర్ పి.శివాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ..పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్‌తో పాటు దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు, ఊపిరితిత్తులు దెబ్బతీనే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి హానికరమైన పొగాకు వినియోగంపై ప్రజలను మరింత చైతన్యపరచాలని చెప్పారు. డీఏఎం సి.మధుసూధన్, బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ మమత, డిపో సూపర్‌వైజర్ అబ్దుల్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికలు చదవడం అలవాటు చేయాలి



గన్నవరం రూరల్: రోజూ దినపత్రికలు చదవడాన్ని విద్యార్థులకు అలవాటుగా మార్చాలని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి చెప్పారు. బుధవారం సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో దినపత్రికలను చదివించే కార్యక్రమం నిర్వహించారు. లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు పూర్తి స్థాయిలో సేవలు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు

పెనమలూరు: నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందించటానికి కానూరులో పార్టీ కార్యాలయం ప్రారంభించానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. వందడుగుల రోడ్డులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని సువిశాలంగా నిర్మాణం చేసి బుధవారం ప్రారంభించారు. వివిధ మతాలకు చెందిన పూజారులు, మత గురువులు ప్రత్యేక పూజలు చేశారు. పార్థసారథి దంపతులు, తనయుడు నితిన్‌కృష్ణ దంపతులు పార్టీ కార్యాలయాన్ని పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి విలేకర్లతో మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా పూర్తి సౌకర్యాలతో పార్టీ కార్యాలయం నిర్మించామని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులతో పాటు, సామాన్య ప్రజలకు ఇక్కడ సేవలు అందిస్తామన్నారు. త్వరలో పార్టీ కార్యాలయానికి పార్టీ పెద్దలు, మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తానన్నారు. ఇక్కడ ప్రారంభ సభ కూడా నిర్వహిస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ తన కార్యాలయ సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే అనిల్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, వివిధ శాఖల డైరెక్టర్లు పి.రాఘవరావు, ఈడే చాముండేశ్వరి ,రామినేని రమాదేవి, మార్కెట్ యార్డు చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని నాని, జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, సర్పంచులు లింగాల భాస్కరరావు, కాకర్ల వెంకటరత్నం, గుంటూరు శ్రీనివాసచౌదరి, నేతలు రాజులపాటి రామచంద్రరావు, అన్నే చిట్టిబాబు, వల్లే నరసింహారావు, వేమూరి రాజా, అక్బర్‌పాషా, నల్లమోతు జీవన్, ఎం.అర్జున్‌రెడ్డి, వెలగపూడి వరప్రసాద్, కె.ఆదిశేషారావు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, తాళ్లనరేంద్ర, చాంద్‌బాషా, సిద్దిక్, బాలకృష్ణ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



పెట్రోలు బంకు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న తన్నీరు

కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు

ఉంగుటూరు: సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. ఉంగుటూరు మండలం ఆముదాలపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.1.15కోట్లతో ఆముదాలపల్లిలో హెచ్‌పీసీఎల్ పెట్రోలు బంకు ఏర్పాటుకు బుధవారం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సంఘాలు పలు వ్యాపారాలు చేసీ ఆర్థిక పరిపుష్టి పెంపొందించుకునేందుకు కేడీసీసీ బ్యాంకు తన వంతు సహకారం అందిస్తుందన్నారు. జిల్లాలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వాహణకు 20 పెట్రోలు బంకులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని బంకులు ప్రారంభం కాగా మరికొన్ని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. స్థానిక సొసైటీల ఆధ్వర్యంలో పెట్రోలు బంకులు నిర్వాహణ జరిగితే వచ్చే ఆదాయంతో సంఘం బలోపేతం అవుతుందన్నారు. దీంతో రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందింజగలుగుతారని చెప్పారు. ఈ అవకాశాలను ఆయా సంఘాలు సద్వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీపీ సరోజిని, వైస్ఎంపీపీ చంద్రశేఖర్, కేడీసీసీ ఏజీఎం శ్రీనివాసరావు, ఉంగుటూరు బ్రాంచ్ మేనేజర్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

• పుస్తక పఠనంపై అవగాహన

పెనమలూరు: వణుకూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు క్రాఫ్ట్ కటింగ్ కలర్ పేపర్‌లతో వివిధ రాకాల ఫ్లవర్స్ తయారు చేశారు. పుస్తక పఠనం, కథలు చెప్పటం, కారెమ్స్ ఆడించారు. గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ మాట్లాడారు.

ముమ్మరంగా కాల్వల్లో పూడికతీత

రామవరప్పాడు : విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో డ్రెయిన్లలో బుధవారం పూడుకతీత పనులు నిర్వహించారు. ప్రధాన గ్రామంతో పాటు పలు అంతర్గత రహదారుల్లో పారిశుద్ధ్య సిబ్బంది పూడికతీసి మురుగునీరు సజావుగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరుస్తున్నట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు తెలిపారు. కాల్వగట్టు ప్రాంతం, ప్రధాన గ్రామంలోని పలు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లు పూడుకుపోయాయని మురుగు నీరు సజావుగా ప్రవహించే నిమిత్తం పూడుకతీత పనులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

వంద శాతం రుణాల రికవరీ

పెనమలూరు: పోరంకి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లో రుణాలు వంద శాతం వసూలు చేశామని సొసైటీ అధ్యక్షుడు మంచినేని పరమేష్ తెలిపారు. ఆయన బుధవారం సొసైటీలో వివరాలు తెలుపుతూ 2022–2023 ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ రుణాల కింద రూ.29 లక్షలు, రైతు నేస్తం రుణాలు రూ.19 లక్షలు, దీర్ఘకాల రుణాలు రూ.21 లక్షలు కలిపి మొత్తం రూ.69 లక్షలు వసూలు చేశామన్నారు. 2020–2021 సంవత్సరంలో సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన 3 శాతం రాయితీ కింద రూ.4.73 లక్షలు వ్యక్తి గత ఖాతాలో జమ చేశామన్నారు.

పింఛనుదారులకు నిధులు మంజూరు

పెనమలూరు: మండల పరిధిలో పింఛన్ లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని ఎంపీడీఓ సునీతాశర్మ తెలిపారు. ఆరు గ్రామాల్లో పింఛన్ లబ్ధిదారులు 5551 మంది ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వం రూ.1,53,46,250 నిధులు మంజూరు చేసిందన్నారు. తాడిగడప మునిసిపాలిటీలో 12,302 మంది లబ్ధిదారులకు రూ. 3,43,43,750 నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందని కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. లబ్ధిదారులకు జూన్ 1వ తేదీ నుంచి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందచేస్తారన్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

కంకిపాడు: పేకాట శిబిరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి కథనం మేరకు... కంకిపాడులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేయగా నలుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.8 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్న మరో పేకాట శిబిరంపై నిర్వహించిన దాడిలో ఆరుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.2040 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ జె.లక్ష్మి తెలిపారు.

ఘనంగా సామూహిక వ్రతాలు



లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వ్రతంలో భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సామూహిక వ్రతాలు బుధవారం ఘనంగా జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రవధానుల సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు జరిగాయి. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఆలయ ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు (బాబు), మాజీ సర్పంచ్ కాకాని అరుణ దంపతులు ఉచితం పూజా సామగ్రి అందించారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా నిరంజనరావు



నిరంజరావును సత్కరిస్తున్న పాడి రైతులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని వీరవల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సొసైటీ అధ్యక్షుడిగా కసుకుర్తి నిరంజనరావు మరో మారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోసైటీలో ఖాళీ అయిన రెండు డైరెక్టర్ల పదవులకు బుధవారం కృష్ణా మిల్క్ యూనియన్ అధికారుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. గత పదిహేను ఏళ్లుగా వీరవల్లి పాల సొసైటీ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న నిరంజనరావు పదవీకాలం ఇటీవల ముగియటంతో ఆయన మరోసారి డైరెక్టర్ ఎన్నికల్లో పోటీ చేసి ఏకగ్రీవంగా గెలుపొందారు. ఆ తర్వాత జరిగిన పాల కేంద్రం పాలకమండలి సమావేశంలోనూ నిరంజనరావునే అధ్యక్షుడిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో మరో మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. తిప్పనగుంట పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్, గన్నవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ కోడెబోయిన బాబి పాల్గొన్నారు.

న్యాయవాది రాజారావు సేవలు స్ఫూర్తిదాయకం



రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లయన్స్ సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: లయన్స్ సభ్యుడిగా ప్రముఖ న్యాయవాది లింగంనేని రాజారావు అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్లు పుట్టగుంట సతీష్‌కుమార్, వీరమాచినేని రామబ్రహ్మం కొనియాడారు. స్థానిక విజయవాడ రోడ్డులోని లయన్స్‌క్లబ్ హాల్‌లో అడ్వకేట్ లింగంనేని రాజారావు సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. తొలుత రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రెండు నిమషాలు మౌనం పాటించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. లయన్స్ సీనియర్ సభ్యులు మేడికొండ బుచ్చిబాపయ్య, నందిగం స్వామి, చలసాని వెంకటేశ్వరరావు, కాకుల సుబ్బారావు, తుమ్మల నారాయణ, మాకినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదల కల సాకారమే లక్ష్యం

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



ఉయ్యూరు శివారు నాగన్నగూడెంలో లే అవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజాబాబు

ఉయ్యూరు(పెనమలూరు): పేదల సొంతింటి కల సాకారం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయటంలో బాధ్యత విస్మరిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఉయ్యూరు శివారు నాగన్నగూడెంలోని జగనన్న లే అవుట్‌ను కలెక్టర్ రాజాబాబు బుధవారం పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని పరిశీలించి మౌలిక వసతులను తనిఖీ చేశారు. 36 ఎకరాల్లో 2004 మంది లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్‌లు, గృహ నిర్మాణాలు పురోగతి అంశంపై శాఖల వారీగా సమీక్ష జరిపారు. నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, రహదారుల నిర్మాణం మొదలైన మౌలిక వసతుల కల్పనపై వివరాలు తెలుసుకున్నారు. పేదల సొంతింటి కల సాకారం చేయటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. లక్ష్యానికి విరుద్ధంగా పని చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేసి లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహనిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా బాధ్యతతో పనిచేయాలన్నారు. లబ్ధిదారులకు ఉన్న అపోహలు తొలగించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శివనారాయణరెడ్డి, హౌసింగ్ పీడీ జీవి సూర్యనారాయణ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎస్‌ఆర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, విద్యుత్ శాఖ ఈఈ రాంబొట్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలి



కళాజాత ప్రదర్శనలో కళాకారులు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మిషన్ లైఫ్–2023 కళాజాత ప్రదర్శన నిర్వహించారు. గుడివాడకు చెందిన కళాభారతి బిల్లపాడు కళాకారులు శేఖర్‌బాబు, దేవప్రసాద్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాల గురించి ప్రజలకు వివరించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నానాటికి పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి మౌనిక, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


పొగాకు అనారోగ్యాలకు మూలం



కంకిపాడు బస్టాండు సెంటరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు ఎస్ఐ జె.లక్ష్మి

కంకిపాడు: పొగాకు అన్ని వ్యాధులకూ మూలమని అదనపు ఎస్ఐ జె.లక్ష్మి అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో కంకిపాడు బస్టాండు సెంటరులో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం బుధవారం నిర్వహించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా సంతకాల సేకరణ చేశారు. తొలుత పోస్టర్ ఆవిష్కరించారు. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి మాట్లాడుతూ పొగాకు వల్ల దీర్ఘకాలిక వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉందన్నారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ ఆంజనేయులు మాట్లాడుతూ పొగాకు వల్ల క్యాన్సర్, క్షయ వంటి ప్రమాద కర రోగాలు వస్తాయన్నారు. ఆహార జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి రమ, సారాభి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



కంకిపాడు: వేసవి శిక్షణతో శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం లభిస్తుందని గోసాల హెచ్ఎంకే పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్ అన్నారు. పాఠశాలలో మే 1వ తేదీన ప్రారంభించిన వేసవి శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. నెల రోజులు పాటు వివిధ క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు రాజును ప్రత్యేకంగా అభినందించారు.

వలంటీర్లకు సత్కారం

గన్నవరం రూరల్ : వలంటీర్‌లు ప్రభుత్వ పథకాలు అర్హులకు అందించే సేవా వారధులని వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ అన్నారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద వలంటీర్లను ఆమె సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి, పంచాయతీ కార్యదర్శి జేవీ నామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, నందిపాటి సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ బత్తుల పానకాలు, వార్డు సభ్యులు వడ్లమూడి శేఖర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. కొత్తగూడెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ తూంపాటి రాంబాబు గ్రామంలో పని చేస్తున్న ఆరుగురు వలంటీర్లను సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. సచివాలయం కార్యదర్శి లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో రాణించాలి

కంకిపాడు: పోటీ పరీక్షల్లో రాణించాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గణితం , స్పోకెన్ ఇంగ్లిష్, ఇతర అంశాలపై పోటీ పరీక్ష నిర్వహించారు. న్యూనతా భావాన్ని విడనాడి పోటీ పరీక్షల్లో రాణించేలా సన్నద్ధం కావాలని సూచించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం నిర్వహించారు. గ్రంథాలయాధికారి సిహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.